క్లుప్తంగా

100 మందికి వైద్య సేవలు

మామిడికుదురు: గ్రామ పంచాయతీ వద్ద అమలాపురం మెడ్ యునైటెడ్ హాస్పిటల్ ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్య శిబిరం జరిగింది. వైద్యులు జామ్‌సన్, వైదేహి ఆధ్వర్యంలో సిబ్బంది 100 మందికి ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. పలువురికి ఉచితంగా ఈసీజీలు తీశారు. సర్పంచ్ గౌస్ మొహిద్దీన్ శిబిరాన్ని సందర్శించారు. ఉచితంగా వైద్య సేవలందిస్తున్న యునైటెడ్ హాస్పిటల్ డాక్టర్లను అభినందించారు. కార్యక్రమంలో జేవీఆర్ పవన్‌కుమార్, అజయ్ కుమార్, భార్గవ్, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

కల్యాణ మండప నిర్మాణానికి రూ.50 వేల విరాళం



ప్రభాకరరావుకు విరాళాన్ని అందజేస్తున్న దాత కుటుంబీకులు

అలమూరు: స్థానిక భువనేశ్వరి చెరువు గట్టు సమీపాన నిర్మిస్తున్న కాపు కల్యాణ మండపం నిర్మాణానికి గ్రామ ఉప సర్పంచ్ చల్లా సీతామహాలక్ష్మి సోదరుడు మల్లిపూడి వెంకటరాజు దంపతులు రూ.50 వేలు విరాళాన్ని ప్రకటించారు. ఉద్యోగ రీత్యా మలేషియాలో స్థిరపడిన ఆ దంపతులు ప్రకటించిన విరాళాన్ని ఉప సర్పంచ్ చేతుల మీదుగా శ్రీకృష్ణదేవరాయ కాపు అభ్యుదయ సంఘం అధ్యక్షుడు చల్లా నానాజీ, రామానుజుల శేషగిరిరావు, శిరిగినీడి పట్టాభి, శ్రీపతి వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ భవనం ప్రారంభం

అయినవిల్లి: మండలంలోని నల్లచెరువు గ్రామ సచివాలయ నూతన భవనాన్ని స్థానిక ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు శుక్రవారం ప్రారంభించారు. ఈ భవనాన్ని ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో రూ.25 లక్షలతో నిర్మించారు. ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు మాట్లాడుతూ గ్రామ సచివాలయం ద్వారా గ్రామాల్లో ప్రజలకు ప్రభుత్వ సేవలను సులభంగా అందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబును సన్మానించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గుండుమొగుల వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ రావూరి వెంకటరామారావు, ఏఎంసీ చైర్మన్ వేటుకూరి వెంకట్రాజు, జెడ్పీటీసీ గన్నవరపు శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ జెండాల పంపిణీ



జాతీయ జెండాలు పంపిణీ చేస్తున్న మ్యాజిక్ ఫ్యామిలీ

ఆత్రేయపురం: మండలంలోని ర్యాలిలో స్థానిక మ్యాజిక్ హౌస్ వద్ద శ్యామ్ జాదూగర్ మ్యాజిక్ ఫ్యామిలీ ఆధ్వర్యంలో ప్రభుత్వం నిర్వహిస్తున్న ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా జాతీయ జెండా పంపిణీ కార్యక్రమం చేపట్టారు. పురాణ ప్రసిద్ధి చెందిన ర్యాలి జగన్మోహినీ కేశవస్వామి, ఉమాకమండలేశ్వర స్వామి ఆలయానికి వచ్చే భక్తులకు అనూస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో జాతీయ జెండాలను బహూకరించి ఉచిత అల్పాహారాన్ని మ్యాజిక్ ఫ్యామిలీ ఏర్పాటు చేసింది. కార్యక్రమంలో ప్రముఖ ఇంద్రజాలికుడు చింతా శ్యామ్‌కుమార్, సంస్థ నిర్వాహకులు అన్నపూర్ణ, మ్యాజిక్ ఫ్యామిలీ సభ్యులు పాల్గొన్నారు.

అందరూ భక్తిభావం కలిగి ఉండాలి

ఆత్రేయపురం: ప్రతి ఒక్కరూ భక్తిభావం కలిగి ఉండాలని నైమిశారణ్య పీఠానికి చెందిన బాలబ్రహ్మానంద సరస్వతి భక్తులకు ఉపదేశించారు. శనివారం సాయంత్రం ఆయన కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణలో భక్తి ప్రవచనాలు ప్రబోధించారు. భక్తులను ఉద్దేశించి పలు ఆధ్యాత్మిక విషయాలను వివరించారు. అధిక సంఖ్యలో భక్తులు ప్రవచన శ్రవణంలో పాల్గొన్నారు. ఏర్పాట్లను ఆలయ చైర్మన్ రుద్రరాజు రమేష్ రాజు, ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో ఆలయ కమిటీ సభ్యులు, సిబ్బంది పర్యవేక్షించారు.

ఘనంగా ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవం

అలమూరు: గ్రామంలో ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవం శనివారం ఘనంగా జరిగింది. జిల్లా విద్యార్థి నాయకులు చేపట్టిన రావులపాలెం నుంచి ఈ బైక్ ర్యాలీలో అలమూరు ప్రభుత్వ హాస్టల్ వద్దకు చేరుకున్నారు. జిల్లా కో కన్వీనర్ వెంకట్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ రవి కుమార్ పాల్గొని ప్రసంగించారు. దేశవ్యాప్తంగా విద్యారంగ సమస్యలపై ఏఐఎస్ఎఫ్ చేస్తున్న పోరాటాల గురించి విద్యార్థులకు తెలియజేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా విద్యార్థి లోకం ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. జిల్లా కన్వీనర్ రవికుమార్, కో కన్వీనర్ వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

సంపూర్ణ ఆరోగ్య ప్రాప్తిరస్తు

- వైఎస్సార్ సంపూర్ణ పోషణతో మేలు
- బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారం

మామిడికుదురు: తల్లీ బిడ్డల సంరక్షణ.. గర్భిణుల సంక్షేమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోంది.. పోషకాహారం అందించడం ద్వారా ఆరోగ్య పరిరక్షణకు బాటలు వేస్తోంది. దీనికి అనుగుణంగా ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణతో ముందుకు వెళ్తోంది. కొత్తగా ప్రవేశపెట్టిన వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లల్లో పోషకాహార లోపం నివారణకు చర్యలు చేపడుతోంది. రక్తహీనత, ఎదుగుదలలో లోపం, మాతాశిశు మరణాలు తదితర ఆరోగ్య సమస్యలను నివారించే దిశగా కార్యాచరణ చేపట్టింది. తద్వారా ఆరోగ్యవంతమైన భావిభారత పౌరులను తీర్చిదిద్దే బాధ్యతను ప్రభుత్వం తన భుజస్కంధాలపై వేసుకుంది. పైసమస్యల పరిష్కారానికి వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం ద్వారా చరమగీతం పాడాలని నిర్ణయించింది.

క్లస్టర్ పరిధిలో లబ్ధిదారులు ఇలా..

నియోజకవర్గం	గర్భిణులు	బాలింతలు	మొత్తం
పి.గన్నవరం	1,639	1,648	3,287
కొత్తపేట	1,862	1,568	3,430
రాజోలు	1,341	1,048	2,389

అందించే పోషకాహారం ఇదే..

టేక్ హోమ్ న్యూట్రీషన్ ద్వారా నెలకు గర్భిణి, బాలింతకు రూ.850 విలువైన ఐదు లీటర్ల పాలు, 25 కోడిగుడ్లు, మూడు కిలోల బియ్యం, అర కిలో ఆయిల్, కిలో కందిపప్పు, రెండు కిలోల రాగి పిండి, కిలో అటుకులు, పావు కిలో బెల్లం, పావు కిలో వేరుశనగ చిక్కీ, పావు కిలో ఎండు ఖర్జూరం పంపిణీ చేస్తున్నారు. ఇప్పటికే అమల్లో ఉన్న వైఎస్సార్ అమృత హస్తం, మధ్యాహ్న భోజన పథకం, బాలామృతం, వైఎస్సార్ బాల సంజీవనికి అదనంగా వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకాన్ని అమలు చేస్తున్నారు.



పి.గన్నవరంలో గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్ల పంపిణీ (ఫైల్)

ప్రభుత్వ నిర్ణయం సంతోషదాయకం



వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం ద్వారా అందిస్తున్న పౌష్టికాహారం ఎంతో మేలు చేస్తుంది. ఈ పథకంతో ఇచ్చే సరకులు సంపూర్ణ ఆరోగ్యానికి దోహదపడతాయి. బాలింతలు, గర్భిణులకు అవసరమైన పది రకాల పౌష్టికాహారం అందించాలన్న ప్రభుత్వ నిర్ణయం సంతోషదాయకం. గతంలోని నిబంధనలను సడలించి, పౌష్టికాహారం కిట్లను నేరుగా ఇంటికి అందించడం హర్షణీయం.

–ముళ్లపూడి స్వాతిశరణ్య, బాలింత, మామిడికుదురు

ఇంటికి తీసుకొచ్చి..



పోషకాహార లోపంతో ఎన్నో సమస్యలు వస్తాయని వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగులు ప్రతి నెలా చెబుతున్నారు. సరైన పోషకాహారం తీసుకోవాలని సూచిస్తున్నారు. పది రకాల సరకులతో కూడిన వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం కిట్లను అంగన్‌వాడీ సిబ్బంది ఇంటికి తీసుకువచ్చి ఇస్తున్నారు. ఈ కిట్లు బాలింతలు, గర్భిణుల ఆరోగ్య పరిరక్షణకు ఎంతో ఉపయోగపడతాయి.

–పితాని గౌరీసత్యశ్రీ, పాశర్లపూడిలంక, గర్భిణి

పోషకాహారం విధిగా తీసుకోండి



తల్లీ, బిడ్డ సంపూర్ణ ఆరోగ్యం కోసం ప్రభుత్వం వైఎస్సార్ సంపూర్ణ కార్యక్రమం ప్రవేశ పెట్టింది. ఈ పథకం ద్వారా అందిస్తున్న పోషకాహారాన్ని గర్భిణులు, బాలింతలు విధిగా తీసుకోవాలి. దీని వల్ల రక్తహీనతను నివారించుకోవచ్చు. గర్భిణిగా నమోదైన నాటి నుంచి ఆరో నెల బాలింత వరకూ ఇంటి వద్దకే సరకులు అందజేస్తున్నాం. ఇది మాతాశిశు సంరక్షణకు ఎంతో మేలు చేస్తుంది.

–వై.విజయశ్రీ, సీడీపీఓ, ఐసీడీఎస్, పి.గన్నవరం

చిన్నారికి సూపర్ టాలెంటెడ్ కిడ్ అవార్డు



గరిమెళ్ళ లక్ష్మీవర్షిక (ఫైల్)

రావులపాలెం: పిట్ట కొంచెం కూత ఘనం అన్నట్టుగా రావులపాలేనికి చెందిన గరిమెళ్ల సూర్య శివరామ కార్తీక్, దుర్గాగాయత్రి దంపతుల కుమార్తె లక్ష్మీవర్షిక 14 నెలల చిన్న వయసులోనే ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌ను సొంతం చేసుకుంది. ఈ పాప 9 నెలల వయసులోనే అన్నీ గుర్తుపట్టడం, వాహనాలు, పండ్లు, జంతువులు, కూరగాయలు, మానవ శరీర భాగాలు, నిత్యావసరాలు, ఇలా అన్నీ గుర్తుపట్టడం గమనించిన తల్లిదండ్రులు ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌కు పాప వీడియోలను పంపించామన్నారు. దీనిని పరిశీలించిన ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్ సంస్థ వారు పాపను సూపర్ టాలెంటెడ్ కిడ్ అవార్డుకు ఎంపిక చేశారన్నారు. జూలై నెలలో తాము ఈ అవార్డుకు పంపగా సంస్థ నుంచి తమకు ధ్రువీకరణ పత్రాలు మెయిల్‌లో శనివారం అందాయని వారు తెలిపారు.

పర్యావరణ పరిరక్షణతోనే ఆరోగ్యం

మలికిపురం: పర్యావరణ పరిరక్షణతోనే ఆరోగ్యం ముడిపడి ఉంటుందని ఎంపీపీ మేడిచర్ల వెంకట సత్యవాణి పేర్కొన్నారు. శనివారం మండలంలోని దిండిలో జరిగిన నా భూమి–నా దేశం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమం జరిగింది. ఎంపీపీ పాల్గొని మొక్కలు నాటారు. ఆమె మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ముదునూరి శ్రీనివాసరాజు, ఎంపీటీసీ తాడి దుర్గ, ఉప సర్పంచ్ కట్టా బాలరాజు, నల్లి శివ కుమార్, కార్యదర్శి సూర్యప్రకాశ రావు, ఏపీఓ ఎండీ నాగప్రసాద్, ఎం.సత్యదుర్గ, దేవ సంసోను, శ్యాంబాబు తదితరులు పాల్గొన్నారు.

వారి సేవలు అభినందనీయం

రాజోలు: లైఫ్ సేవియర్స్ బ్లడ్ గ్రూప్ సంస్థ సేవలు అభినందనీయమని ఎమ్మెల్సీ రవీంద్రబాబు అన్నారు. శనివారం కడలి గ్రామంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్సీ రవీంద్రబాబు ప్రారంభించారు. వాట్సాప్ ద్వారా లైఫ్ సేవియర్స్ ప్రత్యేక గ్రూపు ఏర్పాటు చేసి ఎంతో మందికి రక్తదానం చేయడం అభినందనీయమన్నారు. కడలి, చెన్నడం సర్పంచ్‌లు చొప్పల గుణనాథ్, బడుగు శ్రీనివాసరావు, గ్రూపు అడ్మిన్ రొక్కాల సందీప్‌ను ఎమ్మెల్సీ అభినందించారు. వైఎస్సార్ సీపీ గ్రామశాఖ అధ్యక్షుడు బత్తుల శ్రీనివాస్, బొడ్డపల్లి రవి, మహేష్, అరవ జగన్నాథం, బొంతు అరుణ్, రాంప్రసాద్, రొక్కాల కార్తిక్ తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరునికి ప్రత్యేక పూజలు



చింతలూరులో అలంకార భూషితుడైన శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి

అలమూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో వేంచేసిన వేంకటేశ్వర స్వామి ఆలయాల్లో శనివారం ప్రత్యేక పూజలు జరిగాయి. చింతలూరు, సంధిపూడి, నర్సిపూడి, గుమ్మిలేరు గ్రామాల్లోని ఆలయాలకు పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి దేవతామూర్తులకు నైవేద్యాలను సమర్పించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఆలయ ప్రాంగణాలన్నీ గోవింద నామస్మరణతో మార్మోగిపోయాయి. ఆలయాల వద్ద ఏర్పాటు చేసిన సాంస్కృతిక, ఆధ్యాత్మిక, భజన కార్యక్రమాలు భక్తులను అలరించాయి.

వేధింపులపై కేసు

ఆత్రేయపురం: మండలంలోని బొబ్బర్లంక గ్రామానికి చెందిన ఒక మహిళ తనను వేధిస్తున్నారంటూ వచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు. బొబ్బర్లంక గ్రామానికి చెందిన ఒక మహిళను అదే గ్రామానికి చెందిన ఆమె భర్త సురేష్, అత్తమామలు వేధింపులకు గురిచేస్తున్నట్లు బాధితురాలి ఫిర్యాదు మేరకు శనివారం సాయంత్రం కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

వ్యాధిగ్రస్తుడికి ఆర్థిక సాయం



రోగికి సాయం పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రాపాక

సఖినేటిపల్లి: మండలంలోని అంతర్వేదిపాలెం శివారు అడ్డాలపాలెంకు చెందిన సుగర్ వ్యాధిగ్రస్తుడు కొల్లాబత్తుల ధర్మరాజుకు, రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు రూ.10 వేల ఆర్థిక సాయం శనివారం అందజేశారు. సుగర్ వ్యాధి కారణంగా వెన్నుపూసలో సమస్యతో పాటు, ఇతర సమస్యలతో ధర్మరాజు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో వైద్యఖర్చులకై, కుటుంబ పోషణకై మానవతా దృక్పథంతో కువైట్ కేంద్రంగా ఉన్న ఆదర్శ ఆంధ్రాయూత్–కువైట్ (సామాజిక సేవా సంఘం)పై మొత్తాన్ని సమకూర్చింది. దీనిని ఎమ్మెల్యే రోగికి అందజేశారు. సర్పంచ్ గొల్లమందల చిట్టిబాబు, ఎంపీటీసీ నల్లి రత్నకుమార్, నాయకులు కుసుమ చంద్రశేఖర్‌రావు, నల్లి సుధీర్, రాపాక సూరయ్య, కుసుమ చింటూ, తాడి సహదేవ్, కె.అశోక్ పాల్గొన్నారు.

లక్ష్మీనృసింహుని సన్నిధికి పోటెత్తిన భక్తులు

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని సన్నిధికి శనివారం భక్తులు పోటెత్తారు. సెలవురోజు కావడం, ఏకాదశి తిథి కలసి రావడంతో స్వామి దర్శనానికై పిల్లాపాపలతో తరలివచ్చారు. ఏకాదశి సందర్భంగా ఆలయంలోని స్వామివారి అభిషేకంలోను, సుదర్శన హోమంలోను భక్తులు అత్యధికంగా పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కాగా సాధారణ, ప్రత్యేక దర్శనాల ద్వారా నాలుగువేల మంది భక్తులు స్వామిని దర్శించుకున్నట్టు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ తెలిపారు. అలాగే భక్తులందరూ అన్నదానంలో స్వామి అన్న ప్రసాదాన్ని తీసుకున్నారు. భక్తుల రద్దీకి తగ్గట్టుగా అధికారులు, సిబ్బంది ఏర్పాట్లు చేశారు.

స్వామివారి సన్నిధిలో ఎమ్మెల్యే

అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో శనివారం ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వద్ద ఆయనకు అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. పూజలు అనంతరం అర్చకులు ఆయనకు ఆశీర్వచనాలు పలికి, తీర్థ ప్రసాదాలను అందజేశారు.

అవయవదానానికి దంపతుల నిర్ణయం



సత్యనారాయణ–విశాలక్ష్మి దంపతులు

ఆత్రేయపురం: తాము మరణించిన తర్వాత వారి శరీర అవయవాలను తీసుకుని, వాటి అవసరం ఉన్నవారికి ఉచితంగా అందజేయాలని కోరుతూ దంపతులు రాజమహేంద్రవరం జీఎస్ఎల్ మెడికల్ కాలేజీకి అంగీకార పత్రాన్ని అందజేశారు. ఈనెల 9న జీఎస్ఎల్ మెడికల్ కాలేజీ, సావిత్రీబాయి పూలే ఎడ్యుకేషనల్ ట్రస్టు సంయుక్త నిర్వహణలో శరీర అవయవదానంపై అవగాహన సదస్సు నిర్వహించారు. మరణానంతరం కూడా తాము జీవించాలని ఆత్రేయపురం మండలం పేరవరానికి చెందిన ముళ్లపూడి సత్యనారాయణ–విశాలక్ష్మి దంపతులు భావించారు. అందుకే జీఎస్ఎల్ మెడికల్ కాలేజీ అధ్యక్షుడు గన్ని భాస్కరరావుకు, సావిత్రీబాయి పూలే ట్రస్టు అధ్యక్షురాలు గూడూరి సీతామహాలక్ష్మి ఆధ్వర్యంలో ఆ దంపతులు తమ అవయవ దానానికి సంబంధించిన అంగీకార పత్రాలను శనివారం అందజేశారు. ప్రతి ఒక్కరూ తమ అవయవాలను మరణానంతరం దానం చేయడం వల్ల ఎంతో మందికి ప్రాణం పోసి.. తద్వారా జీవించగలుగుతామని వారు అన్నారు.

రహదారులను పక్కాగా తీర్చిదిద్దుతున్నాం



పాశర్లపూడిలంకలో రోడ్డు ఆధునీకరణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

మామిడికుదురు: పంచాయతీరాజ్‌తో పాటు ఆర్అండ్‌బీ రోడ్లను పక్కాగా తీర్చిదిద్దుతున్నామని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు పేర్కొన్నారు. ఆసియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ (ఏఐఐబీ) నిధులు రూ.84 లక్షలతో చేపట్టనున్న బి.దొడ్డవరం–అప్పనపల్లి, రూ.1.41 కోట్లతో చేపట్టనున్న పాశర్లపూడిలంక–అదుర్రు పంచాయతీరాజ్ రోడ్ల ఆధునీకరణ పనులకు శనివారం ఎమ్మెల్యే చిట్టిబాబు శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ గోదావరి వరద ప్రభావిత గ్రామాల్లో రోడ్లు పాడైపోకుండా పక్కా సిమెంట్ కాంక్రీట్ రోడ్లను నిర్మిస్తున్నామన్నారు. ఎంతో కాలం నుంచి అధ్వానంగా ఉన్న పలు రోడ్లను ఇటీవల అభివృద్ధి చేశామని చెప్పారు. రోడ్లను వెడల్పు చేసి పక్కాగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. రోడ్ల ఆక్రమణల వల్ల అభివృద్ధి పనులకు ఆటంకం ఏర్పడుతుందని చెప్పారు. రోడ్ల ఆధునీకరణకు ప్రజలు సహకారం అందించాలని కోరారు. బి.దొడ్డవరం పంచాయతీ వద్ద జరిగిన 'నా భూమి–నా దేశం'లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఎమ్మెల్యే చిట్టిబాబు ముందుగా అప్పనపల్లిలో బాలబాలాజీ స్వామిని దర్శించుకున్నారు. అర్చకుల నుంచి ఆశీర్వచనం అందుకున్నారు. ఆయా కార్యక్రమాల్లో జెడ్పీటీసీ కశిరెడ్డి అంజిబాబు, సర్పంచ్‌లు గెద్దం మంగాలక్ష్మి, తెలగారెడ్డి సూర్యప్రకాశరావు, అడబాల తాతకాపు, ఎంపీటీసీల సమాఖ్య అధ్యక్షుడు నెల్లి దుర్గాప్రసాద్, ఎంపీటీసీలు వాసంశెట్టి వెంకటరమణ, నామన వెంకటేశ్వరరావు, పీఏసీఎస్ చైర్మన్లు గెద్దం కృష్ణమూర్తి, బొరుసు నర్సింహమూర్తి, పీఆర్ డీఈఈ అన్యం రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

నదీకోత సమస్యను సీఎం దృష్టికి తీసుకువెళ్లా..

మామిడికుదురు: గోదావరి నదీకోత సమస్య తీవ్రతను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లానని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు తెలిపారు. అప్పనపల్లిలో కోతకు గురవుతున్న భూముల్ని, నివాస గృహాలను సమీపించిన కోతను ఎమ్మెల్యే చిట్టిబాబు శనివారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కోనసీమలో వరద బాధితులను పరామర్శించేందుకు వచ్చిన సీఎం జగన్ గోదావరి కోతను స్వయంగా పరిశీలించారని చెప్పారు. పి.గన్నవరం, ముమ్మిడివరం నియోజకవర్గాల్లో తీవ్రంగా ఉన్న గోదావరి కోత నివారణకు సీఎం తక్షణం రూ.300 కోట్లు మంజూరు చేశారని చిట్టిబాబు గుర్తు చేశారు. వైఎస్సార్ సున్నా వడ్డీ రాయితీ పథకం ప్రారంభించేందుకు అమలాపురం వచ్చిన జగన్‌కు పి.గన్నవరం నియోజకవర్గంలోని మిగిలిన మూడు మండలాల్లో ఉన్న గోదావరి కోత సమస్యను వివరించానన్నారు. కోత నివారణకు చర్యలు తీసుకుంటామని సీఎం హామీ ఇచ్చారని చెప్పారు. త్వరలోనే ఈ దిశగా రైతులకు శుభవార్త అందిస్తామన్నారు. ఆయన వెంట జెడ్పీటీసీ కశిరెడ్డి అంజిబాబు, సర్పంచ్ గెద్దం మంగాలక్ష్మి, అప్పనపల్లి దేవస్థానం మాజీ చైర్మన్ పిచ్చుక చిన్న, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు కొమ్ముల రాము, మండల జేసీఎస్ ఇన్‌చార్జ్ జక్కంపూడి వాసు, ఎంపీటీసీల సమాఖ్య అధ్యక్షుడు నెల్లి దుర్గాప్రసాద్ ఉన్నారు.

అన్ని భాషలకూ సంస్కృతమే మూలం

- తత్త్వవిదానంద సరస్వతి స్వామీజీ
- ఘనంగా సంస్కృత కళాశాల శత జయంత్యుత్సవం



దత్తుడు జీవిత చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సరస్వతి స్వామీజీ తదితరులు

పి.గన్నవరం: సంస్కృత భాష ఎంతో గొప్పదని, అన్ని భాషలకూ అదే మూలమని తత్త్వవిదానంద సరస్వతి స్వామీజీ అన్నారు. నరేంద్రపురంలో శ్రీ సుబ్రహ్మణ్య భారతీ భవన సంస్కృత కళాశాల శత జయంత్యుత్సవాలను త్సల్లా బ్రదర్స్ ఆధ్వర్యాన శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్, మాజీ ఎంపీపీ త్సల్లా బిందుమాధవరావు అధ్యక్షతన జరిగిన సభలో స్వామీజీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. భారతీయ సంస్కృతికి మూలమైన వేదాలను, సంస్కృత భాషను పరిరక్షించేందుకు త్సల్లా సుబ్రహ్మణ్యం (దత్తుడు) 1923లో ఇక్కడ సంస్కృత కళాశాల స్థాపించారని చెప్పారు. ఈ కళాశాలను నిర్వహిస్తున్న ఆయన కుటుంబీకులను అభినందించారు. 1951 నుంచి 1971 వరకూ సర్పంచ్‌గా పని చేసిన దత్తుడు.. గ్రామంలో ఉన్నత పాఠశాల ఏర్పాటు చేయడమే కాకుండా, గ్రామాభివృద్ధికి విశేష సేవలు అందించారని చెప్పారు. ఈ సంస్కృత కళాశాలలో గురువు సుబ్బరాయశాస్త్రి వద్ద ఏడేళ్ల పాటు తాను విద్యను అభ్యసిస్తూనే, స్థానిక ఉన్నత పాఠశాలలో ఎస్ఎస్ఎల్‌సీ వరకూ చదువుకున్నానని తెలిపారు. ఈ ప్రాంతంతో పాటు, త్సల్లా వారి కుటుంబీకులతో తనకు విడదీయలేని అనుబంధం ఉందని స్వామీజీ గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా దత్తుడు జీవిత చరిత్ర పుస్తకాన్ని తత్త్వవిదానంద ఆవిష్కరించారు. తిరుపతి సంస్కృత విశ్వవిద్యాలయం ఉప కులపతి జీఎస్ రామకృష్ణమూర్తి, మహామహోపాధ్యాయ విశ్వనాథ గోపాలకృష్ణశాస్త్రి, దోర్బల ప్రభాకరశర్మ, కొంపెల్ల సత్యనారాయణశాస్త్రి, గుళ్లపల్లి సీతారామచంద్ర ఘనపాఠి, పుస్తక రచయిత మిర్తిపాటి శ్రీరామచయనులు తదితరులు ప్రసంగించారు. తొలుత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, సంస్కృత కళాశాల వ్యవస్థాపకుడు దత్తుడు విగ్రహాలకు స్వామీజీ పూలమాలలు వేశారు. కళాశాలలో మధ్యాహ్నం వేదస్వస్తి, సాయంత్రం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ త్సల్లా దొరబాబు, త్సల్లా కృష్ణారావు, శ్రీనివాస్, డొక్కా నాథ్‌బాబు, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పండితులు, గ్రామస్తులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల కలయిక



సఖినేటిపల్లి లూథరన్ ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల కలయిక

సఖినేటిపల్లి: స్థానిక లూథరన్ ఎయిడెడ్ ఉన్నత పాఠశాల 1986–87 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు శనివారం పాఠశాలలో ఓ వేదికపై కలుసుకున్నారు. ఎక్కడెక్కడో ఉద్యోగాల రీత్యా స్థిరపడిన వారంతా ఒక చోట కలుసుకున్నారు. నాటి జ్ఞాపకాలను వారు నెమరు వేసుకున్నారు. అలాగే విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సత్కరించారు. 37 సంవత్సరాల తరువాత కుటుంబ సభ్యులతో ఒకరినొకరు కలుసుకుని సంతోషాన్ని, ఆహ్లాదాన్ని పంచుకున్నారు. పిల్లలతో ఆటపాటలతో ఆనందంగా గడిపారు. పాఠశాల కరస్పాండెంట్ నల్లి ప్రేమానందం, రమేష్, సువర్ణరత్నం, కత్తిమండ చిట్టిబాబు, విజయరత్నం, బళ్ళ నోబుల్ ప్రభాకర్, నేతల నిర్మల, నల్లి సునీల్‌రావు, ఏలూరు విజయశేఖర్, గెద్దం రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో బీసీలపై వివక్ష



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ బీసీ సెల్ మండలాధ్యక్షుడు నూకరాజు

మామిడికుదురు: టీడీపీలో బీసీ సామాజిక వర్గానికి చెందిన నాయకులను అగ్రవర్ణ నేతలు చిన్నచూపు చూస్తున్నారని, దీన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని టీడీపీ మండల బీసీ సెల్ సమావేశం ఆందోళన వ్యక్తం చేసింది. మామిడికుదురు బీసీ సామాజిక భవనంలో శనివారం జరిగిన సమావేశానికి మండల బీసీ సెల్ అధ్యక్షుడు కడలి నూకరాజు అధ్యక్షత వహించారు. సమావేశంలో పాల్గొన్న పలువురు నేతలు మాట్లాడుతూ మొగలికుదురులో ఇటీవల జరిగిన దేవాంగ సాధికార సమావేశంలో బీసీ నేతలను ఉద్దేశపూర్వకంగా చిన్నచూపు చూశారని ఆరోపించారు. సమావేశంలో పార్టీ మండల శాఖ అధ్యక్షుడు మొల్లేటి శ్రీనివాస్‌కు అవమానం జరిగిందన్నారు. సభాగౌరవం పాటించలేదని, ప్రొటోకాల్ పాటించలేదని, ఫ్లెక్సీల్లో కూడా ఫొటో ముద్రించలేదని వాపోయారు. శ్రీనివాస్‌ను కాదని వేరే వ్యక్తికి సభాధ్యక్ష స్థానం ఇవ్వడాన్ని సమావేశం తీవ్రంగా ఖండించింది. జెడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు గ్రూపులను ప్రోత్సహిస్తూ, కుల గ్రూపులు తయారు చేస్తూ నాయకుల మధ్య, కార్యకర్తల మధ్య విభేదాలు సృష్టిస్తున్నారని ఆరోపించారు. అతడిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నయినాల సత్యనారాయణ, మల్లాడి విష్ణు, కోలా రాంబాబు, కంచి విశ్వనాధం, కుడుపూడి సురేష్, పాటి గోవిందు, బొక్కా చిన్న, రాయుడు శ్రీను, గుబ్బల నర్సింహశెట్టి పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సును ఢీకొట్టిన బైక్

సఖినేటిపల్లి: సఖినేటిపల్లిరేవులో పంటుపైకి త్వరితగతిన వెళ్లాలన్న ఆతృతతో బైక్‌పై ఉన్న ముగ్గురిలో ఇద్దరు తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితికి కారణమైంది. ఈ ప్రమాదంలో మరొకరు సురక్షితంగా బయట పడడం గమనార్హం. శనివారం జరిగిన పై ప్రమాదంపై స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం, సఖినేటిపల్లిరేవు వద్ద ఆర్టీసీ బస్ టర్నింగ్ తీసుకుంటున్న సమయంలో, రేవులో పంటుపైకి చేరేందుకు కోళ్ల లగేజీతో మోరికి చెందిన టి.వెంకటేశ్వరరావు, పి.భైరవస్వామి, ఎ.వెంకటేష్‌లు ఆత్రుతతో వెళ్లే క్రమంలో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. బైక్‌తో సరాసరి బస్ ముందు భాగాన్ని వారు ఢీకొట్టారు. ఊహించని ఈ ఘటనతో వారు బైక్‌తో సహా బస్ ముందు భాగంలో టైరు వద్దకు వెళ్లిపోయారు. ప్రమాదంలో ఎ.వెంకటేష్ సురక్షితంగా బయట పడ్డాడు. మిగిలిన ఇద్దరు వెంకటేశ్వరరావు, భైరవస్వామి తీవ్ర గాయాల పాలయ్యారు. గాయపడి అపస్మారక స్థితిలోకి వెళ్లిన బాధితులను ఇద్దరినీ ఆర్టీసీ బస్ డ్రైవర్, స్థానికులు హుటాహుటిన రాజోలు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.